ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
శనివారం 18 మే 2024

అసౌకర్యాలకు నిలయం.. రాయికల్ బస్టాండ్ 8లో..

కొండగట్టులో కానరాని 'క్యాష్ లెస్' సేవలు 7లో..



నకిలీ విత్తనాలకు చెక్

- టాస్క్‌ఫోర్స్ బృందాలతో తనిఖీలపై ప్రభుత్వం దృష్టి
- నాసిరకం విత్తనాలు, పురుగుల మందు అమ్మకాలపై ఫోకస్
- వ్యవసాయ, పోలీసు శాఖ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ బృందాలు

జగిత్యాల, మే 17 (ఆంధ్రజ్యోతి): దిగుబడుల ఆశ చూపి అన్నదాతలకు నకిలీ విత్తనాలను అంటగట్టి సొమ్ము చేసుకునే దళారులపై ఉక్కుపాదం మోపేందుకు అధికార యంత్రాంగం నడుం బిగించింది. అన్న దాతలను ఏటా కల్తీ, నకిలీ విత్తనాలు ఇబ్బందులు పెడుతునే ఉన్నాయి. ధనార్జనే ధ్యేయంగా కొందరు ఈ దందాను సాగిస్తున్నారు. ఏటా వానాకాలం సీజన్‌కు ముందే గ్రామాల్లో తిష్ట వేస్తున్నారు. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి డివిజన్లలోని వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ రైతులను మోసా లకు గురి చేస్తున్నారు. ఈ పరిస్థితిని అరికట్టేందుకు జిల్లాలో పోలీసు, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ బృందాల ఏర్పాటుకు అవసరమైన కసరత్తులు ప్రభుత్వం చేస్తోంది.

నకిలీ విత్తన వ్యాపారంపై నిఘా...

జిల్లాలో వానాకాలం సాగు సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో నకిలీ విత్తన వ్యాపారంపై అధికారులు నిఘా పెట్టారు. నకిలీ విత్తనాలు, ఎరువుల విక్రయాలను అరికట్టడానికి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేస్తున్నారు. పోలీసు శాఖ, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ సభ్యులు ఎప్పటికప్పుడు పలు ప్రాంతాల్లో పర్యటించి సోదాలు నిర్వహించడానికి ప్రణాళిక రూపొందించారు. జిల్లాలో ప్రస్తుతం రైతులు దుక్కులు దున్నుతూ సాగుకు సిద్ధమవుతున్నారు. ఇదే అదనుగా భావించి విక్రయదారులు, నకిలీ, నాసిరకం విత్తనాలు రైతులకు అంటగట్టే ప్రయత్నం చేస్తున్నారు. దీంతో అధికారులు నకిలీలపై నజర్ పెట్టారు.

జిల్లాలో వానాకాలం సాగు అంచనా ఇలా..

జిల్లాలో వానాకాలం సాధారణ సాగు విస్తీర్ణం 3,35,978 ఎకరాలు కాగా ఈ సీజన్‌లో 4,24,425 ఎకరాలు సాగు చేస్తారని అంచనా వేశారు. ప్రధానంగా వరి 3,05,000 ఎకరాలు, మొక్క జొన్న 41,000 ఎకరాలు, కందులు 2,500, పెసర్లు 150, ఇతర పప్పులు 675, సోయా చిక్కుడు 600, పత్తి 20,200, చెరుకు 1,200 ఎకరాలు, పసుపు 11,000, ఇతర పంటలు 42,100 ఎకరాల్లో సాగు కానున్నట్లు అధికారులు అంచనా వేశారు. కాగా వరికి సంబంధించి వివిధ రకాల విత్తనాలు 76,250 క్వింటాళ్ల అవసరమని అంచనా వేశారు. మొక్క జొన్న 3,280 క్వింటాళ్లు, కందులు 75, పెసర్లు 12, సోయాబీన్ 180 క్వింటాళ్లు, పత్తి 40,200 ప్యాకెట్లు అవసరమవుతాయని అధికారులు అంచనా వేశారు. జిల్లాలో మొత్తం కాంప్లెక్స్ 46,100 మెట్రిక్ టన్నులు, యూరియా 36,650, డీఏపీ 11,747, ఎంఓపీ 10,300, ఎస్ఎస్‌పీ 4,780 మెట్రిక్ టన్నులు అవసరమవుతాయని అంచనా వేశారు.

ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాల ఏర్పాటు...

వానాకాలంలో చాలా మంది రైతులు పత్తి, మొక్కజొన్న, వరి, పత్తి, పసుపు పంటలను అధికంగా సాగు చేస్తుంటారు. ఇదే సమయంలో అనుమతి లేని విత్తనాలు, నకిలీ విత్తనాలను వ్యాపారులు మార్కెటింగ్ చేసుకోవడానికి ప్రయత్నిస్తుంటారు. కొందరు లైసెన్స్ ముసుగున నకిలీ వ్యాపారం చేస్తూ రైతులను నట్టేట ముంచుతున్నారు. నకిలీ విత్తనాలు వల్ల దిగుబడి తగ్గి రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదము పొంచి ఉంది. దీనిని అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేస్తోంది. ఈ బృందంలో వ్యవ సాయ శాఖ ఏడీఏ, పోలీసుశాఖ సీఐ, ఎస్ఐ, సీడ్ సర్టిఫయింగ్ ఆఫీసర్ (ఏసీసీఓ), ఎస్‌ఓటీ తదితరులు ఉన్నారు. అధికారులు ఎరువులు, విత్తనాల దుకాణాల్లో విత్తనాలు, పురుగు మందుల స్టాకు క్షుణంగా తనిఖీ చేయనున్నారు. లైసెన్సులు, విత్తనాల స్టాక్ జాబితాలను పరిశీలిస్తారు.

నిబంధనల ప్రకారం సరఫరా చేయాలి

షేక్ యాస్మిన్ బాషా, కలెక్టర్

జిల్లాలో వానాకాలం సీజన్‌లో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను సక్రమంగా సరాఫరా చేయడానికి అధికారులకు దిశానిర్దేశం చేశాము. నకిలీ విత్తనాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలి. నకిలీ విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి మోస పోవద్దు. కల్తీ విత్తనాలు అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాము. విత్తన కొనుగోళ్లలో ఎటు వంటి అనుమానాలున్నా సంబంధిత మండలాల వ్యవసాయ అధికారులను సంప్రదించి సహాయం పొందాలి.

ఇప్పటికే కలెక్టర్ సమీక్ష.. దిశా నిర్దేశం..

వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతులకు అవసరమైన విత్తనాలను, ఎరువులను సక్రమంగా సరఫరా చేయడంపై అధికారులు దృష్టి సారించారు. కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా ఇప్పటికే విత్తన డీలర్లు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. లైసెన్సులు పొందిన డీలర్ల నుంచి మాత్రమే విత్తనాలు, ఎరువులు, పురుగుల మందు కొనుగోలు చేయాలని సూచిస్తున్నారు. కొనుగోలు చేసిన దానికి సంబంధించి డీలర్ల సంతకంతో కూడిన రశీదు తీసుకోవాలని వివరిస్తున్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

జిల్లాలో నకిలీ వ్యాపారుల ఆగడాలను అరికట్టడంపై అధికారులు దృష్టి సారించారు. కొందరు వ్యాపారులు ప్రముఖ కంపెనీల పేరుతో నకిలీ ప్యాకింగ్‌లో నాసిరకం విత్తనాలు నింపి విక్రయించేందుకు ప్రయత్నించే అవకాశాలుంటాయి. విత్త నాలే కాకుండా వాటి ధ్రువీకరణకు వినియోగించే ప్రభుత్వ లేబుళ్లను జాగ్రత్తగా పరిశీలించుకోవాల్సిన అవసరముంటుంది. అవసరమైన వ్యవసాయ అధికారులను సంప్రదించి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చు. నాసిరకంగా పాలిథిన్ సంచుల్లోని విత్తనాలు కొనుగోలు చేయక పోవడమే మంచిది. సీజన్ ప్రారంభం అవుతుండడంతో కొందరు బిల్లులు లేకుండా తక్కువ ధరలకు విత్తనాలు అమ్ముతుంటారు. వారిపై వెంటనే వ్యవసాయ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు.



ఫర్టిలైజర్ డీలర్లు, అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్‌బాషా

ప్రతీ గింజను కొనే బాధ్యత ప్రభుత్వానిదే

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్


మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి

ధర్మపురి, మే, 17 :రైతులు ఎవరు అధైర్య పడవద్దని ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేసే బాధ్యత తీసుకుంటుందని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ఇరిగేషన్, సివిల్‌సప్లై శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని కలిసి నియోజక వర్గ పరిధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన గోనె సంచులు, లారీల కొరత, తడిసిన ధాన్యం విషయంపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సానుకూలంగా స్పందించి ధాన్యం కొనుగోళ్ల వేగవంతం చేయాలని ధర్మపురి నియోజక వర్గానికి సంబంధించి మరో 129 మిల్లులకు అలాట్‌మెంట్ ఇస్తూ ఆదేశాలు జారీ జేశారు. ఈ మేరకు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వ హయంలో కొనుగోలు పరిస్థితి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎలా ఉందో రైతులు గమనించాలని తెలిపారు.

తూకం వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

జిల్లా అడిషనల్ కలెక్టర్ రాంబాబు


మెట్‌పల్లి ఏఎంసీ మార్కెట్ యార్డును పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

మెట్‌పల్లి రూరల్, మే, 17 : ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యాన్ని త్వరగా మిల్లులకు తరలించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ రాంబాబు సూచించారు. శుక్రవారం మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ధాన్యం కొనుగోలులో జరిగిన అలస్యానికి గల కారణాలు, అకాల వర్షానికి తడిసిన ధాన్యం వివరాలను అడిగి తెలుసుకుని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో రెండు రోజులు వర్షాలు ఉన్నాయని వాతావరణ శాఖ తెలిపినందును ధన్యాం కుప్పలపై టార్పాలిన్లను కప్పేందుకు రైతులకు అందించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని త్వరగా తూకం వేసి మిల్లులకు తరలించాలని, ధాన్యాం కొనుగోలు త్వరగా పూర్తి చేయాలని అధికారులు, నిర్వహకులకు సూచించారు. కేంద్రాల్లోని ధాన్యం కుప్పలు, సంచులు అకాల వర్షానికి తడవకుండా చర్యలు తీసుకోవాలని పలు సూచనలు చేశారు. ఆయన వెంటా మెట్‌పల్లి విశాల సహకార సంఘం అధ్యక్షుడు కొమిరెడ్డి తిరుపతిరెడ్డి, డీపీసీఎస్ ఉమాపతి, వరప్రసాద్, సీఈవో ప్రవీణ్‌గౌడ్, అధికారులు ఉన్నారు.

వైభవంగా బోనాల జాతర మహోత్సవం


బోనాల జాతర మహోత్సవంలో పాల్గొన్న మహిళలు

కోరుట్ల రూరల్, మే 17 : మండలంలోని చిన్నమెట్‌పల్లి గ్రామంలో శుక్రవారం దుర్గమ్మ దేవతకు బోనాల జాతర మహోత్సవాన్ని వైభవంగా జరిపారు. దేవాలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించిన పురోహితులు అర్చన అభిషేకాలను జరిపారు. ప్రత్యేక పూజలు జరిపిన పురోహితులు దుర్గాష్టకం, విష్ణుశాస్త్ర నామ పారయణం చేశారు. మహిళలు బోనాలతో శోభాయాత్ర నిర్వహించగా పోతరాజులు చేసిన నృత్యాలు అలరింపజేసాయి. శోభాయాత్ర గ్రామంలోని పురవీదుల గుండా జరిపి దుర్గమ్మకు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు విరివిగా కురిసి పాడి పంటలకు ప్రజల ఆరోగ్యం కాపాడాలని ప్రత్యేక పూజలను నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

సఖి సేవలపై అవగాహన

జగిత్యాలరూరల్, మే 17 : జగిత్యాల రూరల్ మండలంలోని అనంతారం గ్రామంలో మహిళ సంఘాల సభ్యులకు జిల్లా వెల్ఫేర్ అధికారి బి. వాణి శ్రీ ఆదేశాల మేరకు ఉమెన్ ఎంపార్వ్‌మెంట్‌హబ్, సఖి కేంద్రాల ద్వారా లభించే సేవలపైన అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో మహిళసాధికారత కేంద్రం కో ఆర్డినేటర్ అశ్విని, గౌతమి, హేమశ్రీ, వివో పాల్గొన్నారు.

గెలిస్తే అర్జునుడిని.. ఓడితే అభిమన్యుడిని..

ఎమ్మెల్సీ, కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న జీవన్ రెడ్డి

జగిత్యాల టౌన్, మే 17: నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నిక పద్మవ్యూహమని, ఇక్కడ గట్టి పోటీ ఉంటుందని తెలిసి కూడా పోటీచేశానని గెలిస్తే అర్జునుడిని ఓడితే అభిమన్యుడిని అయి చరిత్రలో నిలిచిపోతానని ఎమ్మెల్సీ, కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో శుక్రవారం జీవన్‌రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. నిజామాబాద్ సిట్టింగ్ స్థానం బీజేపీదేనని తెలిసి కూడా రాజకీయంగా జన్మనిచ్చిన జగిత్యాల ప్రజలకు సేవ చేయాలనే తపనతో ఎంపీగా పోటీచేశానని, పోటీ టఫ్‌గా ఉన్నప్పటికీ అందరి ఆశీర్వాదంతో విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఆర్థిక ప్రణాళికతో ముందుకు వెళుతున్నారని రైతులకు ఇచ్చిన ప్రధాన హామీలను త్వరలోనే నెరవేర్చుతామన్నారు. ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి కోతలు లేకుండా సేకరిస్తున్నామన్నారు. 10 ఏళ్ల అధికారంలో ఉండి రైతులను విస్మరించిన బీఆర్ఎస్ ఇపుడేమో రైతు దీక్ష చేయడం దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని నిలువ రించేందుకు బీఆర్ఎస్‌ని బీజేపీకి కుదవపెట్టారనే విషయాన్ని పోలింగ్ జరిగిన రోజునే ఓటర్లతో పాటు ప్రజలు గమనించారన్నారు. బీఆర్ఎస్ పాలనలో వరి వేస్తే ఉరే అని చెప్పి కేవలం సన్న రకాలు మాత్రమే సాగు చేయాలని రైతులను ఇబ్బంది పెట్టింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్న పార్టీ కాంగ్రెస్ అని రెండు లక్షల రుణమాఫీతో పాటు సన్న రకాల సాగు చే సిన రైతులకు ప్రోత్సాహకంగా రూ. 500 బోనస్ ఇస్తామన్నారు.

ఇండియా కూటమి అధికారంలోకి రాగానే క్వింటాలు వరి దాన్యానికి రూ. 3 వేల మద్దతు ధర కల్పి స్తామన్నారు.

బీజేపీకి సిద్ధాంతమే లేదని కేవలం మత విద్వేషాలను రెచ్చ గొట్టి రాజకీయం చేయడం మినహా ఏమి లేదన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా ఉచిత విద్యుత్, రవాణా సౌకర్యం కల్పిస్తున్నారా అని ప్రశ్నించారు. దేశం కోసం ప్రాణ త్యాగాలు చేసిన పార్టీ కాంగ్రెస్ అని వివరించారు. ఈ సమావేశంలో పీసీసీ కార్యదర్శి బండ శంకర్, టీపీసీసీ సభ్యుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, రూరల్ మండల అధ్యక్షుడు రాజేందర్, టీపీసీసీ ఎస్ ఆర్ఐ సెల్ కన్వీనర్ చాంద్ పాషా, ఫ్లోర్ లీడర్ దుర్గయ్య ఉన్నారు.

మృతుడి కుటుంబానికి కొప్పుల పరామర్శ


మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న కొప్పుల ఈశ్వర్

వెల్గటూర్, మే 17: మండలంలోని ముత్తునూర్ గ్రామంలో ధాన్యం తూకం వేస్తూ గురువారం హఠాత్తుగా గుండె పోటుతో మృతి చెందిన సంకెనపల్లి రాజయ్య కుటుంబాన్ని శుక్రవారం మాజీ మంత్రి, పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ పరామర్శించారు. మృతుడి కుటుంబ ఆర్థిక పరిస్థితి తెలుసుకొని రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్లు పత్తిపాక వెంకటేష్, ఏలేటి కృష్ణారెడ్డి, నాయకులు సత్యం, కుశనపెల్లి రవి పాల్గొన్నారు.

ఈత వనం దగ్ధం

భీమారం, మే 17: భీమారం మండల కేంద్రంలో శుక్రవారం ప్రమాదవశాత్తు ఈత వనం దగ్ధమైంది. ఈ ప్రమాదంలో సుమారు 2 వేల వరకు ఈత చెట్లు కాలి పోయినట్లు గీత కార్మికులు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. బాధిత గీత కార్మికులను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

పూర్తికాని కొనుగోళ్లు

ఎండపల్లి, మే17: ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి కాలేదని మండల అధ్యక్షులురావు హన్మంతరావు, అసెంబ్లీ కన్వీనర్ కొమ్ము రాంబాబు అన్నారు. శుక్రవారం రైతులతో కలిసి కొనుగోళ్లు పూర్తి చేయాలని తహసీల్దార్‌కి వినతి పత్రం అందజేశారు. తప్ప తాలు పేరుతో రైతులను మోసం చేస్తున్నారని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు హన్మంత రావు, రాంబాబు, నరేష్, రవి, గంగాచలం పాల్గొన్నారు.

బీపీని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ముప్పు

జిల్లా ఉపవైద్యాధికారి శ్రీనివాస్

జగిత్యాలరూరల్, మే 17 : బీపీని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని, తరచూ పరీక్షలు చేయించుకుని బీపీని అదుపులో ఉంచుకోవాలని జగిత్యాల జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జాతీయ హైపర్‌టెన్షన్ డే దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జగిత్యాల రూరల్ మండలంలోని కల్లెడ, అర్బన్ మండలంలోని మోతె ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో హైపర్‌టెన్షన్ డే పురస్కరించుకొని రోగులకు బీపీ పరీక్షలు నిర్వహించారు. బీపీ పై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ బీపీ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. వైద్యుల సూచన మేరకు బీపీ రోగం నిర్ధారణ అయితే తగిన మందులను వాడాలన్నారు. మందులు వాడకపోతే శరీరంలోని కిడ్నీలు దెబ్బతింటాయని, బ్రెయిన్‌స్ట్రోక్, పక్షవాతం, గుండెనొప్పిలాంటి వ్యాధులు వస్తాయని తెలిపారు. మందులతోపాటు వ్యాయామం చేయాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ బెనర్జీ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.


కల్లెడలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్

రైతులు అధైర్యపడొద్దు

ప్యాక్స్ చైర్మన్ మహిపాల్‌రెడ్డి

జగిత్యాలరూరల్, మే 17 : రైతులు అధైర్యపడవద్దని జగిత్యాల ప్యాక్స్ చైర్మన్ మహిపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జగిత్యాల రూరల్ మండలంలోని మోరపల్లి గ్రామంలో వర్షానికి తడిచిన ధాన్యాన్ని పరీశీలించారు. ఈసందర్బంగా ప్యాక్స్ చైర్మన్ మాట్లాడుతూ తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేసేలా ప్రభుత్వం పై ఒత్తిడి తెస్తామన్నారు. ఈకార్యక్రమంలో స్థానిక రైతులు రాజిరెడ్డి, భాస్కర్‌రావు, మోహన్‌రెడ్డి, లింగారెడ్డి, లక్ష్మారెడ్డి, కేంద్ర నిర్వాహకులు అజయ్, నారాయణ, మల్లేష్, వంశీ, రైతులు పాల్గొన్నారు.

బీఆర్ అంబేద్కర్ నేషనల్ అవార్డుకు ఎంపిక

జగిత్యాల, మే 13 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల పట్టణానికి చెందిన కాయితీ శ్రీనివాస్ డాక్టర్ బీ. ఆర్ అంబేద్కర్ జాతీయ అవార్డుకు ఎంపికైనట్లు బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధకృష్ణ ఉత్తర్వులు జారీ చేశారు. కాయితీ శ్రీనివాస్ కొన్ని సంవత్సరాలుగా సమాజంలో పలు అంశాల పట్ల సేవ కార్యక్రమాలు చేపట్టారు. శ్రీనివాస్ కృషిని గుర్తించి ఈ అవార్డును అందజేసినట్లు రాధక్రిష్ణ తెలిపారు. ఈ అవార్డు అందించడానికి తోడ్పడ్డ కాయితి శకర్ కు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీనివాస్‌ను మాలసంఘాల నాయకులు, అంబేద్కర్‌సంఘాల నాయకులు అభినందించారు.

తూకంలో మోసం

- కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకుల చేతివాటం
- భారీగా నష్టపోతున్న అన్నదాతలు

రాయికల్, మే 17: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. తాలు, తప్ప పేరుతో ప్రతి బస్తాకు రెండు కిలోల కోత కోస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడిచి తాలు, తప్ప పేరుతో సెకండ్ గ్రేడ్ ధాన్యంగా నిర్ణయించి రైతులను నిలువుగా దోచుకుంటున్నారు. మిల్లర్ల వద్ద హమాలీలు లేని కారణంగా ఆలస్యమైందని, అక్కడ కూడా రైతుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. రాయికల్ మండలంలో సింగిల్ విండో, ఐకేపీ, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ప్రబుత్వ నిబంధలనకు తూట్లు పొడుస్తూ కటింగ్ పేరుతో రైతులను మోసం చేస్తున్నారు. ధాన్యం తూకం వేసే సమయంలో తాలు పేరుతో ప్రతి బస్తాకు రెండు కిలోల కోత విధిస్తూ 800 బస్తాలకు పది బస్తాల ధాన్యం కోత విధిస్తున్నారు. అంతేగాకుండా కొనుగోలు కేంద్రాల్లో వడ్ల రాసి చిన్నది అయితే రూ.500, పెద్ద రాశి అయితే రూ.1000 ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. మిల్లుల వద్ద హమాలీలు లేని కారణంగా ధాన్యం బస్తాలు దిగుమతి కాకపోవడంతో ఆలస్యమైందనే పేరుతో అక్కడ కూడా రైతుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. ఒక లారీలో సుమారు 700 వరకు బస్తాలు ఉంటాయి. లారీ నిలిచిందనే పేరుతో బస్తాకు రూ.2 చొప్పున 700 బస్తాలకు రోజుకు రూ.1400 వసూలు చేస్తున్నారు. దీంతోపాటు డ్రైవర్ కూడా బస్తా పేరుతో రోజుకు రూ.500 చొప్పున వసూలు చేస్తున్నారు. ధాన్యం దిగుబడి వస్తుందని రెండు నెలల ముందు నుంచే వ్యవసాయ అధికారులు, మిల్లర్లు, సివిల్ సప్లై, ఐకేపీ సిబ్బంది అంతా కలిసి హడావిడి చేస్తుంటారు. కానీ తీరా చూస్తే ధాన్యం కొనుగోలు చేసే సమయం వచ్చేసరికి లారీలు, హమాలీల కొరత తీవ్రంగా ఉంటుంది. ముఖ్యంగా ధాన్యం ఎగుమతికి లారీల సరఫరా కోసం వేసే టెండర్లలో నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుంది. అంతేగాకుండా లక్షల క్వింటాళ్ల ధాన్యం మిల్లులోకి చేరుతున్న సమయంలో ఆ మొత్తం దిగుమతి చేసుకోవ డానికి అవసరమైన హమాలీల ఏర్పాటుకు ముందస్తు చర్యలు చేపట్టడంతో అధికారులు విఫలమైనట్లు స్పష్టంగా కనిపి స్తుంది. లోక్‌సభ ఎన్నికలు పూర్తి కావడంతో ఇప్పటికైనా అధికార యంత్రాంగం ధాన్యం కొనుగోళ్లపై పూర్తి స్థాయిలో దృష్టి సారించి లారీల కృత్రిమ కొరత లేకుండా కొనుగోళ్లను వేగవంతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


ధాన్యం తూకం వేస్తున్న హమాలీలు

రూ.7,190 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, మే 17: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,190 రూపాయలు పలికింది. శుక్రవారం మార్కెట్ యార్డుకు రైతులు 95 క్వింటాళ్ల పత్తి తీసుకువచ్చారు. వ్యాపారులు గరిష్ఠ ధర 7,190 రూపాయలు, కనిష్ఠ ధర ఐదు వేల రూపాయలు చెల్లించి పత్తి కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఎల్లారెడ్డిపేట, మే 17: మండలంలో వెంకటాపూర్ శివారులోని మానేరు వాగు నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నామని ఎస్ఐ రమాకాంత్ శుక్రవారం తెలిపారు. వాహనాన్ని స్వాధీన పర్చుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించామని చెప్పారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు.

అకాల వర్షంతో నష్టం

● తడిసిన ధాన్యం ● విరిగిపడిన విద్యుత్ స్తంభాలు, చెట్లు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శుక్రవారం కురిసిన వర్షానికి భారీ నష్టం వాటిల్లింది. కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. ఈదురుగాలులతో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు, చెట్లు విరిగిపడ్డాయి.

మెట్‌పల్లి రూరల్, మే 17: మండలంలో గురువారం రాత్రి, శుక్రవారం కురిసిన భారీ వర్షానికి మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డుతో పాటు మండలంలోని పలు కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసింది.

● ఇబ్రహీంపట్నం: మండలంలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి అమ్మక్కపేట, ఇబ్రహీంపట్నం, గోధుర్, వేములకుర్తిలో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసింది.

● కథలాపూర్: మండలంలోని చింతకుంట, ఊట్‌పల్లి, పెగ్గెర్ల, భూషణ రావుపేట, దుంపెట గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసింది. పలు గ్రామాల్లో వీధులు జలమయమయ్యాయి.

● మల్యాల: మండలంలో శుక్రవారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి రామన్నపేట, మల్యాల, ముత్యంపేట, తాటిపల్లి, లంబాడిపల్లి, రాంపూర్ గ్రామాల్లో ధాన్యం తడిసింది.

● వేములవాడ టౌన్: మండలంలో శుక్రవారం భారీ ఈదురుగాలులతో కురిసిన వర్షానికి చెట్టు విరిగి రోడ్డుపై పడింది. వేములవాడ మండలం ఆరెపల్లి సమీపంలోని పెట్రోల్‌బంక్ సమీపంలోని తుమ్మచెట్టు విరిగి రోడ్డుపైన పడింది. ఆ సమయంలో రోడ్డుపైన వాహనాలు రాకపోవడంతో ప్రమాదం తప్పింది. చెట్టు కరీంనగర్-వేములవాడ ప్రధాన రోడ్డుపై పడడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది.

● కోనరావుపేట: మండలంలో కురుస్తున్న వర్షానికి కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసి మొలకెత్తుతోంది. లారీల కొరతతో ధాన్యం తరలించడంలో జాప్యం జరుగుతోంది. అకాల వర్షాల నుంచి ధాన్యాన్ని కాపాడుకోవడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

● రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయింది.

● ధర్మారం: మండల కేంథ్రంలో శుక్రవారం తెల్లవారుజాము నుంచి వర్షం కురిసింది. రోడ్లన్నీ బురదమయమయ్యాయి. వర్షం కారణం గా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది.

● మంథని/మంథని రూరల్: మండలంలో గురువారం అర్ధరాత్రి, శుక్రవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి మార్కెట్ యార్డులో, వివిధ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్లో అమ్మకానికి పోసిన ధాన్యం తడిసింది. మండలంలోని ఆరెంద, వెంకటాపూర్, మల్లారంతో పాటు పలు గ్రామాల్లో ఇంకా కోయని పొలాలు నేలకొరిగాయి. ఖానాపూర్ గ్రామంలో గాలి దుమారానికి ఎల్‌టీ లైన్ విద్యుత్ తీగలు తెగిపడడంతో అమ్మకుంటి సమ్మయ్య అనే రైతుకు చెందిన రెండు గేదెలు విద్యుదాఘాతంతో మృతి చెందాయి.

● కళ్యాణ్‌నగర్: గోదావరిఖనిలో శుక్రవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. శుక్రవారం తెల్లవారు జామున 4గంటల వరకు కురిసింది. భారీ వర్షంతో రామగుండంలోని పలు కాలనీలు జలమయమయ్యాయి. గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం 8.30గంటల వరకు 2.5సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది.


మెట్‌పల్లి మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యం


ధర్మారంలో ధాన్యం కుప్పలపై కప్పిన టార్పాలిన్లు


వేములవాడ మండలం ఆరెపల్లిలో రోడ్డుపై విరిగి పడిన తుమ్మచెట్టు


రుద్రంగిలో ధాన్యం కుప్పలు చూట్టూ చేరిన వర్షపు నీరు

పూర్తి స్థాయిలో పనులు కల్పించాలి

● ఉపాధి కూలీల ఆందోళన


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న తహసీల్దార్ కిషన్

కోరుట్ల రూరల్, మే 17: తమకు పూర్తి స్థాయిలో పనులు కల్పించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని అయిలాపూర్ గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీలు శుక్రవారం ఆందోళనకు దిగారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలు మాట్లాడుతూ గ్రామ శివారులోని నర్సింహులకుంట, బూర్గం కుంటల మాటు కాల్వల పూడికతీతతో పాటు ఇతర పనులను చేస్తుండగా ఆ ప్రాంతం లోని రైతులు అడ్డుకుంటున్నారన్నారు. దీంతో తాము పని దినాలను కోల్పోతున్నామని, ఈ విషయాన్ని తహసీల్దార్ దృష్టికి తెచ్చేందుకే ఆందోళనకు దిగామన్నారు. తహసీల్దార్ కిషన్ ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. చేయవలసిన పనుల కోసం సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేసి పనులు కల్పిస్తామని తెలపడంతో కూలీలు ఆందోళన విరమించారు.

పాత కక్షలతో దాడి: ఇద్దరి మృతి


శ్రీనివాస్, మహేష్ (ఫైల్)

బుగ్గారం మే 17: జగిత్యాల జిల్లా బుగ్గారం మండలంలో పాత కక్షలు పురి విప్పాయి. పాత పగలు మనసులో పెట్టుకుని మండలంలోని గోపులాపూర్ గ్రామానికి చెందిన దిటి శ్రీనివాస్(36), దీటి మహేష్ (38)పై అదే గ్రామానికి చెందిన బుర్ర నవీన్‌తో పాటు కొంత మంది కర్రలతో దాడి చేశారు. ఈ ఘటనలో శ్రీనివాస్, మహేష్ మృతి చెందారు. ఎస్సై శ్రీధర్‌రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బుర్ర నవీన్, దీటి శ్రీనివాస్ పక్క పక్క ఇళ్లలో నివసిస్తుంటారు. ఆ రెండు ఇళ్ల మధ్యలో ఉన్న ఇంటిని రెండేళ్ల క్రితం శ్రీనివాస్ కొన్నాడు.

ఆ ఇల్లు తనకు కావాలంటూ నవీన్ తరచూ శ్రీనివాస్‌తో గొడవ పడేవాడు. ఇదే విషయమై గ్రామం లో పెద్ద మనుషుల సమక్షంలో పలుమార్లు పంచాయితీలు జరిగాయి. ఇది మనసులో పెట్టుకున్న నవీన్ మరి కొందరితో కలిసి గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత ఇంటి బయట పడుకున్న శ్రీనివాస్‌తో పాటు అతని బంధువు దీటి మహేష్‌లపై కర్రలతో దాడి చేశాడు. శ్రీనివాస్, మహేష్ అరుపులకు ఇరుగు పొరుగు వారు రావడంతో నిందితులు ఘటనా స్థలం నుంచి పారిపోయారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడ్డ శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలతో కొట్టుమిట్టాడుతున్న మహేష్‌ను జగిత్యాల అసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం వరంగల్‌కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతు మహేష్ శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందాడు. దీటి శ్రీనివాస్‌కు వివాహం జరిగింది. మహేష్‌కి భార్య, నాలుగేళ్ల కుమారుడు ఉన్నాడు. శ్రీనివాస్ చెల్లెలు మమత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

● హెచ్‌సీఏ, కేడీసీఏ ఆధ్వర్యంలో క్రికెట్ శిక్షణ ● ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మూడు చోట్ల శిబిరాలు

● పాల్గొంటున్న 500 మంది క్రీడాకారులు



కరీంనగర్‌లో క్రికెట్ శిక్షణ పొందుతున్న బాలికలు, బ్యాటింగ్ చేస్తున్న బాలుడు

కరీంనగర్ స్పోర్ట్స్, మే 17: వేసవి సెలవుల్లో క్రికెట్ శిక్షణపై విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) సౌజన్యంతో కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ (కేడీసీఏ) ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మూడు కేంద్రాల్లో వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నారు. కేడీసీఏ ఆరు సంవత్సరాలుగా శిక్షణ శిబిరాలు నిర్వహించలేదు. ఈ యేడాది హెచ్‌సీఏ, కేడీసీఏ శిబిరాలను నిర్వహిస్తుండడంతో విద్యార్థులు, యువకులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, గోదావరిఖని, సిరిసిల్లలో శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నారు.

నిష్ణాతులైన కోచ్‌లతో శిక్షణ ఇస్తుండడంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 500 మంది క్రీడాకారులు శిక్షణ పొందుతున్నారు. అండర్- 14, అండర్-16, అండర్-19, అండర్-23 వయసు విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా ఉదయం 5 నుంచి 8.30 వరకు శిక్షణ ఇస్తున్నారు. కరీంనగర్‌లో వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల ఎదుట ఉన్న జిల్లా క్రికెట్ సంఘం మైదా నంలో, సెయింట్ ఆల్ఫోన్స్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహిస్తున్నారు. గోదావరిఖనిలోని జీఎం గ్రౌండ్‌లో, సిరిసిల్లలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్నారు. అత్యధికంగా గోదావరిఖనిలో 200 మంది క్రీడాకారులు శిక్షణ పొందుతుండగా కరీంనగర్‌లో 160 మంది, సిరిసిల్లలో 140 మంది క్రీడాకారులు శిక్షణ తీసుకుంటున్నారు. క్రీడాకారులకు మూడు శిక్షణ కేంద్రాల్లో శిక్షణ అనంతరం హెచ్‌సీఏ సౌజన్యంతో అరటి పండ్లు, కోడి గుడ్లు, హెల్త్ డ్రింక్స్ అందిస్తున్నారు. కరీంనగర్‌లో డి.శ్రీనివాస్, పన్యాల శ్రీనాథ్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్, మరో ముగ్గురు కోచింగ్ ఇస్తున్నారు. గోదావరిఖనిలో కిరణ్, సుదేశ్‌కుమార్, సిరిసిల్లలో ప్రసాద్ శిక్షకులుగా వ్యవహరిస్తున్నారు.

● శిబిరాలను సందర్శించిన హెచ్‌సీఏ కమిటీ

ఇటీవల హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అపెక్స్ కమిటీ సభ్యులు ఉమ్మడి జిల్లాలో నిర్వహిస్తున్న క్రికెట్ శిక్షణ శిబిరాలను సందర్శించారు. హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్‌రావుతో పాటు కార్యదర్శి, కోశాధికారి, ఉపాధ్యక్షులు ఈ కమిటీలో ఉన్నారు. రాష్ట్రంలో క్రికెట్ క్రీడాభివృద్ధికి, క్రికెట్ స్టేడియాల నిర్మాణానికి గ్రామీణ స్థాయిలో క్రీడాకారుల్లోని క్రీడా నైపుణ్యాన్ని వెలికి తెచ్చేందుకు కృషి చేస్తామని చెప్పారు.

● శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- వి ఆగంరావు, కేడీసీఏ అధ్యక్షుడు



హెచ్‌సీఏ సహకారంతో కేడీసీఏ నిర్వహిస్తున్న వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు, ఔత్సాహిక యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలి. ఈ శిబిరాల్లో శిక్షణకుకు అవసరమైన పరికరాలు అందుబాటులో ఉంటాయి. గ్రామీణ ప్రాంతంలోని అత్యుత్తమ క్రీడాకారులను వెలుగులోకి తెచ్చేందుకు ఈ శిబిరాలు దోహదపడతాయి.

ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల ధర్నా

● రెండు గంటల పాటు రోడ్డుపై బైఠాయించిన అన్నదాతలు

● అధికారుల హామీతో ధర్నా విరమణ

రాయికల్, మే 17: ధాన్యం కొనుగోలు జాప్యంతో పాటు తూకం వేసిన ధాన్యం బస్తాలను మిల్లులకు తరలించకపోవడంతో రాయికల్-మైతాపూర్ రోడ్డులో రైతులు రెండు గంటల పాటు ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సొసైటీ కొనుగోలు కేంద్రం నిర్లక్ష్యంతో రోడ్డుపైకి రావాల్సి వస్తుందని, కేవలం ఆరుగురు హమాలీలతో ధాన్యాన్ని తూకం వేస్తున్నారని, తూకం వేసిన ధాన్యాన్ని లారీల కొరత ఉందంటూ మిల్లుకు తరలించకపోవడంతో ఆరుగాలం శ్రమించి పండించిన పంట అకాల వర్షంతో తడిసిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాగే వర్షాలు కురిసి ధాన్యం తడిస్తే తమ పరిస్థితి ఏంటని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవోను ప్రశ్నించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల జాప్యంతో ప్రైవేట్ వ్యక్తులకు ధాన్యం విక్రయించాల్సి వస్తోందని, త్వరగా కొనుగోళ్లు చేపట్టాలని సొసైటీ అధికారులకు అనేకసార్లు మొర పెట్టుకున్నా స్పందన లేకపోవడంతో ప్రతి సంవత్సరం రోడ్డు ఎక్కాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వేగంగా కొనుగోళ్లు జరిపి ధాన్యాన్ని వెంటనే మిల్లుకు తరలించే ఏర్పాటు చేయాలని రైతులు కోరారు. రైతుల ఆందోళన సమాచారంతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పద్మయ్య, ఏఎస్సై దేవేందర్ పది రోజుల్లో కల్లాల వద్ద నుంచి ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని సీఈవోకు సూచించి రైతులకు నచ్చజెప్పడంతో నిరసనను విరమించారు. రైతుల ధర్నాతో రోడ్డుకిరువైపులా వాహనాలు నిలిచిపోయాయి.




రాయికల్-మైతాపూర్, కరీంనగర్-వేములవాడ ప్రధాన రహదారిపై బైఠాయించిన రైతులు

● **వేములవాడ మండలం అనుపురంలో..**

వేములవాడ టౌన్: ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చి రోజులు గడుస్తున్న కొనుగోలులో జాప్యం చేస్తున్నారని వేములవాడ మండలం అనుపురం గ్రామానికి చెందిన రైతులు శుక్రవారం కరీంనగర్-వేములవాడ ప్రధాన రహదారిపై బైఠాయించారు. నాంపల్లి సింగిల్‌విండో ఆధ్వర్యంలో అనుపురం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 20 రోజులుగా కొనగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే రెండుసార్లు వర్షానికి తడిసాయని, ఇప్పటికి ధాన్యం కొనుగోలు చేయకోవడంతో గ్రామానికి చెందిన రైతుల ధాన్యం బస్తాలతో సుమారు గంటపాటు రోడ్డుపై బైఠాయించారు. దీంతో ట్రాఫిక్ స్తంభించి రోడ్డుపై ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న వేములవాడ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీచ్చారు. దీంతో రైతులు శాంతించి ధర్నాను విరమించారు.

● నాంపల్లి ప్రాథమిక సహకార సంఘం పరిధిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎప్పటికప్పుడు ధాన్యం కొనగోళ్లు చేస్తున్నామని, అనుపురం గ్రామంలో 80 శాతం ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయని ఇక్కడి బీఆర్ఎస్ నాయకులు కావాలని రాజకీయం చేస్తున్నారని సింగిల్ విండో ఛైర్మన్ బీరెడ్డి సల్మాన్‌రెడ్డి ఆరోపించారు. అనుపురం రైతులు ధర్నా చేశారని తెలుసుకున్న సల్మాన్‌రెడ్డి అనుపురం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు.

ఘనంగా గంగాదేవి బోనాలు



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న గంగపుత్రులు

రాయికల్, మే 17: మండలంలోని భూపతిపూర్ గ్రామంలోని పెద్ద చెరువు గట్టు మీద నెలకొన్న గంగాదేవి ఆలయంలో శుక్రవారం గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో పురోహితులు చెరుకు మహేశ్వరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగాశివుని కల్యాణోత్సవం కోసం హోమం నిర్వహించారు. చెరువులను కాపాడుకోవడమే గంగమ్మ ఉత్సవాల ప్రత్యేక అని వారు తెలిపారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం అధ్యక్షుడు కామని రజనీ కుమార్, కార్యదర్శి హరీష్ కుమార్, ఉపాధ్యక్షుడు చంద్రప్రకాశ్, సభ్యులు మాసపేట మల్లయ్య, వెంకట్రాజం, కామని లక్ష్మయ్య, సూర్యప్రకాశ్, రాజేశం, భూమరాజం, నరేష్, రమేష్, అరవింద్, ప్రభాస్, రాజ్ కుమార్, చిన్న నర్సయ్య, గంగాధర్, మురళి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

కరీంనగర్ టౌన్, మే 17: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో 2024-25 విద్యాసం వత్సరంలో ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ కోర్సుల్లో మొదటి దఫా అడ్మిషన్ల కోసం ఆన్‌లైన్ ద్వారా 100 రూపాయల రిజిస్ట్రేషన్‌తో దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎస్.కవిత ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఐటీఐ వెబ్‌సైట్‌లో దరఖాస్తులను ఈ నెల 16 నుంచి జూన్ 10వరకు స్వీకరించడం జరుగుతుందని, అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేరెళ్లలో మూడిళ్లలో చోరీ

ధర్మపురి, మే 17: మండలంలోని నేరెళ్ల గ్రామంలో గురువారం అర్ధరాత్రి మూడిళ్లలో చోరీ జరిగింది. గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు కంతి మహేష్ ఇంటిలో ప్రవేశించి రూ 2.35 లక్షలు నగదు, కంతి నరేష్ ఇంటిలో తులంనర బంగారు ఆభరణాలు, బొనగంటి రాజవ్వ ఇంటిలో 20 తులాల వెండి, అర తులం బంగారం, ఐదు వేలు నగదును అపహరించారు. రాత్రి వేళలో ఆ ముగ్గురు వ్యక్తులు ఇంటిలో పడుకుని ఉన్న సమయంలో వచ్చిన వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బాధితులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది చేరుకుని వివరాలు సేకరించారు.

ఫిట్స్‌తో మతిస్థిమితం లేని మహిళ మృతి



పొన్నం కవిత (ఫైల్)

వేములవాడ టౌన్, మే 17: వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లిలో శుక్రవారం తెల్లవారుజామున ఫిట్స్‌తో మతిస్థిమితం లేని మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వేములవాడ రూరల్ మండలం ఎదురుగట్ల గ్రామానికి చెందిన పొన్నం కవిత (36) అనే మహిళకు మతిస్థిమితం కోల్పోయి ఇంట్లోనే వుంటుంది. నాలుగు రోజుల క్రితం ఇంట్లో నుంచి పారిపోయిన కవిత ఫిట్స్‌తో నాంపల్లి గ్రామంలో మృతి చెందింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతురాలికి మతిస్థిమితం సరిగా ఉండదని, ఫిట్స్, మూర్ఛ వ్యాధితో బాధపడుతుందని కుటుంబ సభ్యుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వేర్వేరు చోట్ల ఆటో బోల్తా : ఇద్దరు డ్రైవర్ల మృతి



చెలకని రాజు(ఫైల్)

కాల్వశ్రీరాంపూర్, మే 17: పెద్దపల్లి జిల్లాలోని కాల్వశ్రీరాంపూర్, పెద్దపల్లి మండలంలో ఆటో బోల్తా పడి ఇద్దరు డ్రైవర్లు మృతిచెందారు. కాల్వశ్రీరాంపూర్ మండలంలోని ఏదులాపూర్-పెద్దరాతుపల్లి గ్రామాల మధ్యన ఉన్న మట్టలవాగు బ్రిడ్జివద్ద ఆటో బోల్తాపడి ఓదెల మండలం ఇందుర్తి గ్రామానికి చెందిన చెలకని రాజు(30) అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో మరో మహిళకు తీవ్ర గాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. ఓదెల మండలం ఇందుర్తి గ్రామానికి చెందిన చెలకని రాజు, బీస రజిత కాల్వశ్రీరాంపూర్ మండలంలోని ఏదులాపూర్‌లో గురువారం జరిగిన వారసంతలో కూరగాయలు అమ్ముకొని స్వగ్రామానికి బయలుదేరారు. అర్ధరాత్రి పెద్దరాతపల్లి మట్టల వాగు బ్రిడ్జి వద్ద ప్రమాదావ శాత్తు ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రాజు అక్కడిక్కడే మృతి చెందగా, రజితకు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి ఎస్ఐ ఓంకార్ యాదవ్ చేరుకొని ప్రమాద వివరాలు తెలుసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. రాజుకు భార్య భవాని, కూతురు, కొడుకు ఉన్నారు. మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పెద్దపల్లి రూరల్: మండలంలోని పాలితం గ్రామానికి చెందిన ఆలేటి భూమయ్య (42) ఆటోడ్రైవర్ ప్రమాదవశాత్తు ఆటో బోల్తాపడి మృతిచెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఆటో నడుపుతూ జీవనం సాగించే భూమయ్య శుక్రవారం యథావిధిగా పాలితం గ్రామం నుంచి పెద్దపల్లికి ప్యాసింజర్‌లను తీసుకోచ్చి వచ్చాడు. తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో పాలితం గ్రామ శివారులో ప్రమాదవశాత్తు ఆటో బోల్తాపడటంతో ఆటోలో ఉన్న డ్రైవర్ భూమయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి పెద్దపల్లి ఆసుపత్రికి తీసుకురాగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆటోలో ప్రయాణికులు ఎవరూ లేరని తెలిపారు. మృతుడి భార్య జయ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి ఎస్ఐ లక్ష్మణ్ రావు తెలిపారు.

బిల్లుల కోసం గ్రామ పంచాయతీకి తాళం

గంభీరావుపేట, మే 17: అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు చెల్లించాలని మాజీ సర్పంచ్ గ్రామపంచాయతీ కార్యాలయానికి తాళం వేశారు. గంభీరావుపేట మండలం కోళ్లమద్ది మాజీ సర్పంచ్ ఏనుగు కేశవరావు ఈజీఎస్ పథకం కింద గ్రామ పంచాయతీ భవనం మంజూరవడంతో రూ.20 లక్షలతో నిర్మించారు. మరో ఎనిమిది లక్షల రూపాయలను గ్రామాభివృద్ధికి వెచ్చించారు. ఇప్పటి వరకు బిల్లులు రాకపోవడంతో శుక్రవారం గ్రామపంచాయతీ కార్యాలయానికి తాళం వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు ఇవ్వకుండా సర్పంచులను నిర్లక్ష్యం చేశాయని మండిపడ్డారు. సర్పంచుల గౌరవ వేతనం కూడా మూడు సంవత్సరాలది పెండింగ్‌లో ఉన్నదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఐదు నెలలుగా గ్రామ పంచాయతీలకు నిధులుగానీ, సర్పంచుల పెండింగ్ బిల్లులు గానీ విడుదల చేయలేదన్నారు. బిల్లులు రాక పలువురు సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి స్పందించాలని, పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని కోరారు.

సౌత్ ఆఫ్రికాలో కొత్తపేట వాసి మృతి

ఎండపల్లి, మే 17: ఉపాధి నిమిత్తం సౌత్‌ఆఫ్రికా వెళ్లిన మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన వ్యక్తి అక్కడే మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నడిగట్టు సత్తయ్య(43) కొన్నేళ్ల క్రితం జీవనోపాధి కోసం సౌత్ ఆఫ్రికాకు వెళ్లాడు. 20 నెలల క్రితం ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులతో కలిసి గడిపాడు. ఇటీవలే మళ్లీ వెళ్లాడు. శుక్రవారం ఉదయం గుండెపోటు రావడంతో అక్కడి గదిలోనే మృతి చెందాడు. సత్తయ్య సోదరుడు ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి తెలిపాడు. సత్తయ్యకు భార్య పద్మ, కొడుకు, కూతురు ఉన్నారు.

కొండగట్టులో కానరాని 'క్యాష్ లెస్' సేవలు

● మూలన పడ్డ స్వైపింగ్ యంత్రాలు, క్యూఆర్ కోడ్ బోర్డులు

● అసౌకర్యానికి గురి అవుతున్న భక్తులు

మల్యాల, మే 17: ఆన్‌లైన్ సేవల కాలమైన నేటి రోజుల్లో ప్రజలు అత్యధికంగా 'క్యాష్ లెస్' లావాదేవీపై ఆధారపడగా ప్రతీ చోట క్యాష్‌లెస్ సేవలు అందుబాటులో ఉన్నాయి. అయితే కొండగట్టు అంజన్న క్షేత్రంలో మాత్రం భక్తులు క్యాష్‌లెస్ సేవలకు నోచుకోవడం లేదు. దీంతో భక్తులు డబ్బుల కోసం కొండపైన తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. అయిదేళ్ల క్రితం దేవస్థానం అధికారులు స్వైపింగ్ యంత్రాలు, క్యూఆర్ కోడ్ స్కానర్‌సిస్టంను అందుబాటులోకి తీసుకువచ్చారు. కొన్నేళ్ల క్రితం కార్డులు ఎక్కువ వినియోగించగా వాటి కోసం స్వైపింగ్ యంత్రాలను దేవస్థానం పరిధిలోని బుకింగ్ తదితర చోట్ల ఏర్పాటు చేశారు. అయితే అవి మున్నాళ్లకే అటకెక్కాయి. కాగా ఇటీవల యూపీఐ లావాదేవీలు పెరుగడంతో రెండేళ్ల క్రితం ఆలయంలో భక్తులు స్వామి వారికి చెల్లించుకునే కానుకలను సమర్పించడానికి గాను క్యూఆర్ కోడ్ స్కానర్ బోర్డులు పెట్టారు. అవి కూడా ఇటీవల మూలనపడ్డాయి. దీంతో భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఆన్‌లైన్ సేవల్లో భాగంగా నగదు రహిత లావాదేవీల నిర్వహణకు ఏర్పాటు చేసిన స్వైపింగ్ యంత్రాలు, క్యూఆర్ కోడ్ బోర్డుల నిర్వహణ కొరవడడం, అవి పని చేయకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పట్టణాలు, నగరాల నుంచి వచ్చే భక్తుల ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి. నగదురహిత సేవలకు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతన్నారు.

● **ఉచిత వైఫై మేలు..**

కొండగట్టు కొండపైన సెల్‌ఫోన్ సేవలు నామమాత్రమే. ఇక్కడ సెల్‌ఫోన్ సేవలను విస్తృతంగా అందించేందుకు సెల్ సంస్థలు ముందుకు రాకపోవడంతో అంతంత మాత్రమే అందుతున్న సెల్ సేవలతో ఇబ్బందులు పడుతున్న భక్తులు.. క్యాష్‌లెస్ సేవలకూ సెల్‌సేవలు విఘాతంగా మారుతున్నాయి. భక్తుల సౌకర్యార్థం దేవస్థానం అధికారులు ఉచిత వైఫై సేవలపై దృష్టి సారించాలని పలువురు భక్తులు కోరుతున్నారు. దేవస్థానానికి కోట్లాదిగా ఆదాయం భక్తుల ద్వారా వివిధ మార్గాలో సమకూరుతుండగా పలు టికెట్లు, ప్రసాదాలు, వాహన పూజలు తదితర వాటి ద్వారా నగదు లావాదేవీలు జరుగుతుంటాయి. అధికారులు నగదురహిత సేవల కోసం ఉచిత వైఫై సమకూర్చే అవకాశం మెండుగా ఉన్నా అటువైపుగా దృష్టి సారించడం లేదు.



ఆలయంలో ఓ మూలన ఉన్న క్యూఆర్ కోడ్ బోర్డు

● **చర్యలు తీసుకుంటాం**

చంద్రశేఖర్, ఆలయ ఈవో

కొండగట్టులో భక్తులకు క్యాష్‌లెస్ సేవలు అందించడానికి గాను తగుచర్యలు తీసుకుంటాం. యూపీఐ సేవలు అందుబాటులో తీసుకురావడంపై దృష్టి సారిస్తం. సెల్‌సేవలు అందించే సేవలు అందుబాటులో లేకపోవడంతో ఉన్నపాటి కొద్ది సిగ్నల్స్ క్యాష్‌లెస్ సేవలకు అందక ఆన్‌లైన్ సేవలకు అసౌకర్యంగా మారుతోంది. దీంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కోనే పరిస్థితి నెలకొంటుంది.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

మంథని జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్




మాట్లాడుతున్న డా. శ్రీధర్, బెస్ట్ స్టూడెంట్ అవార్డు అందిస్తున్న ప్రిన్సిపాల్

కొడిమ్యాల, మే 17: ఇంజనీరింగ్ విద్యార్థులు లక్ష్య సాధనతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మంథని జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్ అన్నారు. శుక్రవారం మండలంలోని నాచుపల్లి జేఎన్ టీయూ ఇంజనీరింగ్ కళాశాల 16వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహిం చారు. వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ విద్యార్థులు క్లాస్‌లకు క్రమం తప్పకుండా హాజరు కావాలన్నారు. ఇండస్ట్రీలో నిలదొక్కుకోవటానికి కమ్యూనికేషన్స్ నైపుణ్యతను మరింత పెం చుకోవాలన్నారు.

అంతకు ముందు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.. టి. వేణుగోపాల్ ప్రారంభ ఉపన్యాసంతో వేదికపైకి అందరిని ఆహ్వానించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డా. కామాక్షిప్రసాద్ మాట్లాడుతూ జేఎన్‌టీయూ కళాశాల 2023-2024 నుంచి పదేళ్ల పాటు అటాన మస్ ప్రతిపత్తి పొందిందన్నారు. కళాశాలలో చేసిన అభివృద్ధిని ఈ సందర్భంగా వివరించారు. అనంతరం అకాడమిక్ ప్రైజెస్, స్పోర్ట్స్ గేమ్స్ ప్రైజెస్ అందించారు. యూనివర్సిటీ నుంచి గోల్డ్ మెడల్ సాధించిన నలుగురు విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందించారు. బెస్ట్ స్టూడెంట్ అవార్డు సాదించిన జి తేజస్వినికి ప్రశంసా పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు, భోధన, భోదనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం అదుపు తప్పి యువకుడి మృతి



కర్రోళ్ల రాజు(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, మే 17: ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేట గ్రామ శివారులో శుక్రవారం రాత్రి ద్విచక్రవాహనం అదుపు తప్పిన సంఘటనలో గంభీరావుపేట మండలం నర్మాల గ్రామానికి చెందిన బీఎస్పీ మాజీ మండల అధ్యక్షుడు కర్రోళ్ల రాజు (38) అనే యువకుడు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడని ఎస్ఐ రమాకాంత్ తెలిపారు. చీకటి పడడం వల్ల ఎవరూ గమనించకపోవడంతో ఆయన మృతదేహం ఎనిమిది గంటల పాటు ఘటన స్థలంలోనే పడి ఉందని పేర్కొన్నారు. ఆయన కథనం మేరకు.. గంభీరావుపేట మండలం నర్మాలకు చెందిన రాజు తన బైక్‌పై ఈ నెల 16న సాయంత్రం ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామానికి వచ్చా డు. తిరుగు ప్రయాణంలో రాత్రి మండలంలోని కోరుట్లపేట శివారులో ద్విచక్రవాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. దాంతో రాజు ఎగిరిపోయి పక్కనే ఉన్న వ్యవసాయ భూమిలో పడి మృతి చెందాడు. ఉదయం పొలాల వద్ద కు వెళ్లిన రైతులకు మృతదేహం కనిపించడంతో సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని గుర్తించి నర్మాలకు చెందిన రాజుగా నిర్ధారించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా రోదించారు. పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడు రాజు తల్లి ఎల్లవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు. మృ తుడికి భార్య లక్ష్మీ, కూతురు ఉన్నారు. రాజు కొంత కాలంగా బీఎస్పీ పార్టీలో చురుకైన నాయకుడిగా కొనసాగుతు న్నాడు. రెండు పర్యాయాలు బీఎస్పీ మండల అధ్యక్షుడిగా పనిచేశారు. రాజు మృతిపై బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు స్వామి, నాయకులు సంతాపం తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

దాడి ఘటనలో నిందితుల అరెస్ట్

రామడుగు, మే 17 : తమ్ముళ్లపై దాడి చేసిన అన్న, అతని కుమారుడిని శుక్రవారం అరెస్టు చేసినట్లు చొప్పదండి సీఐ ప్రకాశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని దత్తోజీపేట గ్రామానికి చెందిన తోట్ల రాములు, తోట్ల మల్లయ్య, తోట్ల ముత్తయ్య ముగ్గురు అన్నదమ్ములు కాగా గత కొంత కాలంగా వ్యవసాయ భూమిపై గొడవలు జరుగుతున్నాయి. అందులో భాగంగా గురువారం రాత్రి గ్రామ శివారులో ముత్తయ్య, మల్లయ్యలు మోటార్ సైకిల్‌పై వెల్లుతుండగా అన్న రాములు, అతని కుమారుడు తోట్ల మహేందర్‌లు కర్రలతో దాడికి పాల్పడగా గాయాల పాలైన ఇద్దరిని చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. మల్లయ్య కుమారుడు నరేష్ ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు సీఐ, ఎస్ఐ తెలిపారు.

గోదావరిఖనిలో తల్లీకూతుర్ల అదృశ్యం

కోల్‌సిటీ, మే 17: గోదావరిఖని భరత్‌నగర్‌కు చెందిన దాసారపు రజిత(23) అనే వివాహిత, ఆమె కూతురు అనన్య (21నెలలు)ను తీసుకుని గురువారం ఉదయం నుంచి అదృశ్యమైనట్లు వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. భార్యభర్తల మధ్య గొడవ జరుగగా మనస్తాపం చెంది ఇంట్లో నుంచి వెళ్లిపోయిందన్నారు. ఆమె తల్లి సులోచన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామ ని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ 8712656516, ఎస్ఐ టీ శ్రీనివాస్ 9010072555కి సమాచారం ఇవ్వాలని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి కోరారు.

అధిక లోడు.. అవస్థలు చూడు!



అధిక లోడుతో వెళుతున్న లారీకి అడ్డు తగిలిన తీగలు

ఎల్లారెడ్డిపేట, మే 17: అసలే కిందకు వేలాడుతున్న తీగలు.. భారీ వాహనాలు వెళితే మరో వాహనం ప్రయాణించేందుకు కష్టంగా ఉన్న రోడ్డు.. ధాన్యం బస్తాలు నింపుకుని అధిక లోడుతో వెళుతున్న లారీకి కరెంటు స్తంభాల నుంచి ఇళ్లకు వెళ్లే విద్యుత్తు సర్వీస్ తీగలు అడ్డు తగిలాయి. అడుగడుగునా తీగలు అడ్డురావడంతో లారీ డ్రైవర్ వాహనాన్ని ఆపి పైకెక్కి తీగలను సరి చేసి మళ్లీ ముందుకు సాగాడు. ఎల్లారెడ్డిపేట మండలంలోని మొదటి బైపాస్ రోడ్డులో అధిక లోడుతో ప్రయాణిస్తున్న లారీ వల్ల శుక్రవారం రాకపోకలు నిలిచిపోయాయి. వాహనదారులు లారీ డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధిక లోడుతో భారీ వాహనాలు ప్రయాణించడం వల్ల తమ ఇళ్ల సరఫరా అయ్యే విద్యుత్తు సర్వీస్ తీగలు తెగిపోతున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా బైపాస్ రోడ్డు వెంట అధిక లోడుతో వచ్చే వాహనాలను అనుమతించకూడదని కోరుతున్నారు.



తీగలను తీసేందుకు ఇబ్బంది పడుతున్న వాహన డ్రైవర్

బస్సును ఢీకొన్న లారీ

- ప్రయాణికులకు తప్పిన ప్రాణాపాయం

ఎండపల్లి, మే 17: మండలంలోని కొత్తపేట గ్రామంలో ఆర్టీసీ బస్సును వెనక నుంచి లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలయ్యాయి. బస్సులో ఉన్న దాదాపు వంద మందికి ప్రాణాపాయం తప్పింది. ప్రయాణికులు, స్థానికులు తెలిపిన సమాచారం మేరకు.. కరీంనగర్ నుంచి మంచిర్యాలకు వెళుతున్న టీఎస్ 02 యూఏ 3672 అనే నంబర్ గల బస్సు మండలంలోని కొత్తపేట గ్రామానికి రాగానే వెనుక నుంచి వస్తున్న లారీ ఆటోను తప్పించబోయి బస్సును వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ఒకేసారి పెద్ద శబ్దం రావడంతో ప్రయాణికులు ఉలిక్కిపడ్డారు. ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి పోలీసులు వచ్చి పరిశీలించారు.

గంభీరావుపేటలో విషాదం


గంభీరావుపేట, మే 17: ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేటలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదం గంభీరావుపేట మండలంలో విషాదం అలుముకుంది. గంభీరావుపేట మండలం నర్మాల గ్రామానికి చెందిన బీఎస్పీ నేత కర్రోల్ల రాజు కొరుట్లపేట రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడు రాజు అనేక సమస్యలపై ప్రజలతో కలిసి ఉద్యమించాడు. బీఎస్పీ మండల శాఖ అధ్యక్షుడిగా చాలాకాలం పనిచేశాడు. కర్రోల రాజు ఆకస్మిక మరణం తన సొంత గ్రామమైన నర్మాలతో పాటు మండల వ్యాప్తంగా విషాద చాయలు చోటు చేసుకున్నాయి. బీఎస్పీ శ్రేణులు, స్నేహితులు, బంధువులు, పలు రాజకీయ పార్టీల నాయకులు ప్రజలు రాజు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

పూర్ణాహుతి.. సహస్ర కలశాభిషేకం

- కొనసాగుతున్న నరసింహ నవరాత్రోత్సవాలు - స్వామి వారలను దర్శనం చేసుకున్న భక్తులు



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు



అభిషేకం కోసం కలశం తీసుకెళ్తున్న ఆలయ ముఖ్య అర్చకులు

ధర్మపురి, మే 17: ధర్మపురి క్షేత్రంలో ఐదో రోజు శుక్రవారం నరసింహ నవరాత్రోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని స్థానిక లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఉదయం వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చరణల మధ్య ముఖ్య అర్చకులు అర్చకులు పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామి వారలకు పురుషసూక్త, శ్రీసూక్త, కల్పోక్త, వ్యాసపూర్వక, శోడషోపచార పూజ, సహస్ర నామార్చన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పంచోపనిషత్తులచే మన్యసూక్త, రుద్రాభిషేక పూజలు, సహస్ర కలశాభిషేకం, ప్రత్యేక పూజలు, అర్చనాది ఆరాధన, హారతి కార్యక్రమాలు నిర్వహించారు. వాస్తు, యోగిని, క్షేత్రపాలక, నవగ్రహా, సర్వతోభద్ర మండలి, స్థాపిత దేవతా పూజలు అనంతరం స్వామివారికి సహస్ర కలశాభిషేకం నిర్వహించారు. లోక క్షేమార్థం యాగశాల వద్ద అర్చకులు హోమం నిర్వహించారు. స్వామి వారలను అందంగా అలంకరణ చేశారు. ఆలయాలు భక్తి గీతాలతో ప్రతి ధ్వనించాయి. గోదావరి నదిలో స్నానాలు చేసిన భక్తులు స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, డీసీఎంఎస్ ఛైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, చిలుకముక్కు రమణాచార్యా, నరసింహమూర్తి, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

బడిబాటను సద్వినియోగం చేసుకోండి



కథలాపూర్‌లో విద్యార్థిని అడ్మిషన్ చేసుకుంటున్న ఎంఈవో

కథలాపూర్, మే 17 : ప్రభుత్వ పాఠశాలల్లో అనేక వసతులు కల్పిస్తున్న నేపథ్యంలో తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడికి పంపించాలని ఎంఈవో ఆనందరావు కోరారు. శుక్రవారం మండలంలోని ఇప్పపల్లి, కథలాపూర్ గ్రామాల్లో ఉపాధ్యాయులతో కలిసి బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ బడుల్లో మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో విద్యాబోధన వంటి వసతులు ఉన్నాయని చెప్పారు. వచ్చే విద్యా సంవత్సరానికిగాను నూతనంగా పలువురు విద్యార్థులకు అడ్మిషన్ ఇచ్చారు. సర్కారు బడుల అభివృద్ధికి విద్యార్థుల తల్లిదండ్రుల భాగస్వామ్యం అవసరమన్నారు. ఈ కార్యక్రమాల్లో అంబారిపేట పాఠ శాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కిషన్‌రావు, సీఆర్‌పీలు రాజేందర్, కృష్ణప్రసాద్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

రామచంద్రంపేటలో రేషన్ షాపు ఏర్పాటు చేయాలి

తహసీల్దార్‌కు వినతిప్రతం అందజేసిన యువకులు



మెట్‌పల్లి తహసీల్దార్ శేఖర్‌కు వినతి ప్రతం అందజేస్తున్న యువకులు

మెట్‌పల్లి రూరల్, మే, 17 : మండలంలోని రామచంద్రంపేట గ్రామంలో రేషన్ షాపును ఏర్పాటు చేయాలని యువత మెట్‌పల్లి తహసీల్దార్ శేఖర్‌ను కోరారు. శుక్రవారం తహసీల్దార్‌కు వినతి ప్రతం అందజేసి రేషన్ కోసం గ్రామస్థుల ఇబ్బందులను తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి నెల ప్రభుత్వం అందజేసే రేషన్ తీసుకోవడానికి గ్రామం నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న వెల్లుల్ల గ్రామానికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. రేషన్ తీసుకోవడానికి గ్రామంలోని వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నరని వాపోయారు. ఏండ్ల నుంచి తమ సమస్యను అధికారులకు, నాయకులకు తెలిపిన పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా గ్రామంలో రేషన్ షాపును ఏర్పాటు చేయాలని తహసీల్దార్‌కు సమస్యను విన్నవించామన్నారు. స్పందించిన తహసీల్దార్ సమస్యను ఉన్నత అధికారులకు తెలిపి షాపు ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని తెలపరన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో మునుగురి రాజశేఖర్, రెబ్బస్సు రంజిత్, ఎక్కల్‌దేవి రోహిత్, లింగంపల్లి అనిల్, బాణాల గణేష్, అనిల్, యువకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న శ్రీవాణి కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు

మెట్‌పల్లి, మే, 17 : మెట్‌పల్లి పట్టణంలోని శ్రీ వాణి జూనియర్ కళాశాల 2004-06 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం పట్టణంలోని మనోహర్ గార్డెన్‌లో పూర్వ విద్యార్థులు, అధ్యాపక బృందం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. విద్యార్థులు ఒకరినొక్కరు పలకరించుకుని తమ యోగ క్షేమాలను అడిగి తెలుసుకోని గత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపక బృందాన్ని శాలువలతో సన్మానించి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం విద్యార్థులు ఆట పాటలతో సరదగా గడిపి సహపక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు క్రిష్ణ, లక్ష్మి, నారాయణ, వేణుగోపాల్, రమేష్, రవీందర్, విద్యార్థులు, పాల్గొన్నారు.

సరిపడా విత్తనాలు అందుబాటులో ఉంచాలి

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి

మెట్‌పల్లి రూరల్, మే, 17 : ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేయడానికి సరిపడా విత్తనాలు అందుబాటుల్లో ఉంచాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి మండల వ్యవసాయాధికారులను కోరారు. శుక్రవారం మెట్‌పల్లిలోని మండల వ్యవసాయాధికారి షాహిద్‌అలీని కలిసి వర్షాలు కురుస్తున్నందున విత్తనాలు అందుబాటులో ఉంచాలని కోరారు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేయడానికి పచ్చి రొట్టె(జిలుగు, జనుము, పెసర్లు) తగినంత విత్తనాలు అందుబాటులో ఉంచి సాగు గురించి రైతులకు సలహాలు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సరిపడే విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, నిత్యం గ్రామాలను సందర్శించి రైతులకు తమ సిబ్బందితో పాటు తాను కూడ సూచనలు ఇస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్ సెల్ పట్టణాధ్యక్షుడు సంతోష్ రెడ్డి, ఎన్ఎస్‌యూఐ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్, శివ పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనా మహోత్సవం

మెట్‌పల్లి, మే, 17 : పట్టణంలోని శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి 331 ఆరాధన మహోత్సవ కార్యక్రమాన్ని స్వర్ణకార సంఘం అధ్యక్షుడు నాంపల్లి సింహాద్రి ఆధ్వర్యంలో సభ్యులు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఆయలంలోని స్వామి వారికి పురోహితుడు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించి తీర్థాప్రసాదాలను అందజేశారు. భక్తులకు సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం సంఘం సభ్యుడైనా గంగాధర్‌కు యూనివర్ సీటి వారు అందజేసిన గోల్డ్ మోడల్, ప్రశంస పత్రం అందజేసి అభినందించారు.

ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి దురి శె ట్టి నటరాజ్, ఉపాధ్యక్షుడు ఇందూరి గిరిధర్, కోశాధికారి నాంపల్లి సంజీవ్, సహాయ కార్యదర్శి కోటగిరి సంతోష్, వర్తక బులియన్ అసోసియేషన్ అధ్య క్షుడు ఇల్లెందుల శ్రీధర్, తాడూరి శ్రీనివాస్, సుంకం మహేష్, తునికి ఆనంద్, శేఖర్, నాంపల్లి మారుతి, వంగల మహేందర్, భూమేశ్వర్, కిషన్, శ్రీధర్, వెంకటనర్సయ్య, కిషన్, నరహరి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

చందుర్తి, మే 17: ఉరుములు, మెరుపులతో వర్షం కురుస్తున్న సమ యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చందుర్తి ఎస్సై శ్రీకాంత్ సూచిం చారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వర్షం పడుతున్న సమయంలో చెట్ల కిందకు, బయటకు వెళ్లవద్దన్నారు. చెట్ల మీద పిడుగులు పడే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. ఇటీవల అకస్మాత్తుగా పిడుగులు పడడంతో జిల్లాలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారన్నారు. ఈదురు గాలులకు విద్యుత్ తీగలు తెగి మీదపడి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. భారీ వర్షాలు కురుస్తున్నప్పుడు వాగులు, చెరువులు, కుంటలు నిండుకుండలా ఉంటాయని, పిల్లలు, యువత వెళ్లవద్దన్నారు.

చెడగొట్టిన వాన..!



తడిచిన ధాన్యం సంచులు



తడిచిన నువ్వుల పంట

- వారం రోజుల నుంచి వర్షాలు
- కేంద్రాల్లో మొలకెత్తిన ధాన్యం, నల్లగా మారిన నువ్వులు
- లారీల కొరతతో ఎక్కడికక్కడే నిలిచిన ధాన్యం
- ఉపాధి కూలీలు, గీతకార్మికులకు నష్టం

కథలాపూర్, మే 17 : ఏప్రిల్, మే మాసాల్లో కురిసే చెడగొట్టు వానలు నిజంగానే రైతులను చెడగొట్టాయి. వారం రోజుల నుంచి నిరంతరంగాకు రుస్తున్న వర్షాలు అన్నదాత కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. కోతలు కోసి కేంద్రాలకు ధాన్యం తరలించిన రైతులకు అడుగడుగునా కష్టాలు ఎదురవుతుండగా వానల రూపంలో మరింత నష్టాలను తెచ్చిపెట్టింది.

నువ్వులు కోసి పెంట్లను ఆరబెట్టగా తడవడంతో నల్లగా మారి అమ్ముకునేందుకు వీలు లేకుండా మారాయి. ఈ ఏడు క్వింటాల్‌కు రూ. 15 వేల దాకా పలుకుతున్న నేపథ్యంలో తమ పంట పండిందని ఆశించిన రైతులకు భారీ నష్టాలు తప్పలేదు.

లారీల కొరతతో ఎక్కడికక్కడే ధాన్యం

మండలంలో సెర్ప్ ఆధ్వర్యంలో 11, భూషణరావుపేట సింగిల్ విండో ఆధ్వర్యంలో 11, సిరికొండ సింగిల్ విండో 2, గంభీర్‌పూర్ సహకార సంఘం ఆధ్వర్యంలో 4 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తున్నారు. ఈ రబీ సీజన్‌లో అధికార యంత్రాంగం ఊహించిన దానికంటే ధాన్యం అధికంగా వచ్చింది. ఇప్పటి వరకు సిరికొండ సొసైటీలో 24 వేల క్వింటాళ్ళు, భూషణరావుపేట విండో పరిధిలో 1.04 లక్షలు, సెర్ప్ ఆధ్వర్యంలో 82 వేలు, గంభీర్‌పూర్ సొసైటీలో 34 వేల క్వింటాళ్ల మేర ధాన్యం కొనుగోళ్లు జరిపారు.

ఈ కేంద్రాల్లో మరో లక్ష క్వింటాళ్ల మేర తూకం వేయాల్సిన ధాన్యం ఉంది. అయితే లారీల కొరత కారణంగా తూకం వేసిన ధాన్యం ఎక్కడిక్కడే పేరుకు పోయింది. తరచూ వర్షాలు కురుస్తున్నందు వల్ల ధాన్యం తడిచి మొలకలెత్తుతోంది. లారీల డ్రైవర్లు సంచికి రూ.4 ఇస్తేనే కేంద్రానికి వస్తామనే డిమాండ్ పెడుతున్నారు. దీంతో విధిలేని పరిస్థితుల్లో చెల్లించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. నిరంతరాయంగా కురుస్తున్న వర్షాల కారణంగా ఉపాధి హామీ పనులకు కూడా ఆటంకం ఏర్పడుతూ కూలీలకు పనికి వెళ్లలేని దుస్థితి ఏర్పడుతోంది. గీత కార్మికులకు వర్షాల వల్ల కల్లు విక్రయాలకు అవరోధం కలుగుతోంది. మామిడి రైతులు కూడా నష్టాలను చవిచూడాల్సి వచ్చింది.

కేంద్రంలోనే ధాన్యం మొలకెత్తింది: బావు శ్రీహరి, రైతు



కోతలు కోసి నెల రోజుల కిందట ధాన్యంను కేంద్రంకు తెచ్చాను. ధాన్యం ఇప్పటికీ తూకం వేయలేదు. ప్రతీ రోజూ వర్షం కురుస్తుండడం వల్ల పూర్తిగా మొలకలు వచ్చాయి. ఎండ బెటడానికి అవకాశం లేకుండా ఉంది. మొలకలెత్తిన ధాన్యం బరువుకు రాకుండా ఉంటుంది. దీంతో సగం మేర నష్టం తప్పేలా లేదు. ఇప్పటికే ధాన్యం మూడు చోట్లకు మార్చాను.

ఉపాధి పనులు నిలిచిపోతున్నాయి: బాపురపు గంగాధర్, కూలీ



వేసవి కాలంలో ఉపాధి పనులు ఎక్కువగా జరుగుతుంటాయి. ప్రతీ దినం పనులకు వెళ్లి ఉపాధి పొందుతుంటాను. చెరువులో మట్టితీత పనులు జరుగుతున్నాయి. వర్షాలు కురుస్తున్న కారణంగా పనులు నిలిచిపోయినం. దీంతో ఉపాధి లభించానికి అవరోధం కలుగుతోంది.

అర్ధాంతరంగా నిలిచిన రోడ్డు పనులు

పూర్తి చేయాలని కోరిన ప్రజలు

కొడిమ్యాల, మే 17 : మండల కేంద్రమైన కొడిమ్యాల నుండి పూడూర్ వరకు ఆర్అండ్‌బీ పీరియాడికల్ రీనివల్ రోడ్డు పనులు సుమారు గత 20 రోజులుగా నిలిచిపోయాయి. నాన్‌ప్లాన్ నుంచి రూ 5 కోట్ల 80 లక్షల రూపాయలు పీరియాడికల్ రీనివల్ పనులకు గతంలో ప్రభుత్వం మంజూరు చేసింది. ఇప్పటి వరకు 40 నుండి 50 శాతం పనులు పూర్తైయినట్లు అధికారుల ద్వారా తెలిసింది. నిత్యం వాహనాల రాక పోకలతో రద్దీగా ఉండె కొడిమ్యాల-పూడూర్ గ్రామాల మధ్య ఉన్న అప్పారావుపేట గ్రామంలో అక్కడక్కడ, మధ్యలో ఉన్న మార్కెట్ యార్డు సమీపంలో అక్కడక్కడ పనులు పూర్తి కాక పోవటంతో భారీ వాహనాలు, బస్సులు వచ్చినప్పుడు లేస్తున్న దుమ్ముతో ద్విచక్ర వాహన దారులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వర్షాలు కురుస్తె పూర్తి కాని రోడ్డుపై ఇబ్బందులయ్యే పరిస్థితి ఉంటుందదని అప్పారావుపేట గ్రామస్థులు తెలిపారు.నిలిచన రోడ్డు పనులను పూర్తి చేయించాలని పూడూర్-కొడిమ్యాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై సంబంధిత ఆర్అండ్‌బీ ఏఈఈ జగదీశ్వర్‌ను వివరణ కోరగా సాధ్యమైనంత త్వరగా మిగిలిన రోడ్డు పనులను పూర్తి చేయిస్తామన్నారు.



మిగిలిన రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలి

మాజీ సర్పంచ్ (అప్పారావుపేట) గరిగంటి మల్లేశం

పూడూర్ కొడిమ్యాల మధ్య నిలిచిన రోడ్డు పనులను సంబంధిత అధికారులు త్వరితగతిన పూర్తి చేయాలి. మిగిలిన రోడ్డు పనులను పూర్తి చేయించడానికి ప్రభుత్వం, కాంట్రాక్టర్ చొరవ చూపాలి. రోడ్డుపై వాహనాల రాకపోకలతో లేస్తున్న దుమ్ముతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దూరం చేయాలి.

కాంగ్రెస్ అభ్యర్థి వంశీకృష్ణ గెలుపు ఖాయం

పెగడపల్లి, మే 17: మొన్న జరిగిన పార్లమెంట్ ఎన్నికలలో పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడుగా గడ్డం వంశీకృష్ణ గెలుపు ఖాయమని పెగడపల్లి మండల కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ అధ్యక్షులు బుర్ర రాములు గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు ఒరుగల శ్రీనివాస్‌లు మాట్లాడు తూ తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం అధికారం చేపట్టిన వంద రోజుల్లోపే ఆరు గ్యారంటీలలో నాలుగింటిని అమలు చేసిన పార్టీగా కాంగ్రెస్ పార్టీని విశ్వసించి చేతి గుర్తుకు ఓటు వేశారన్నారు. పార్టీ అభ్యర్థి కోసం అహర్నిషలు కృషి చేసిన నాయకులకు కార్యకర్తలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో నాయకులు చాట్ల విజయభాస్కర్, వంశీదర్‌రావు, రాంరెడ్డి,ఎల్లయ్య పాల్గొన్నారు.

కొనసాగుతున్న అల్పాహారం పంపిణీ

కోరుట్ల, మే 17: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద కోరుట్ల లయన్స్ క్లబ్ సభ్యులు నిర్వహిస్తున్న అల్పాహార పంపిణీ శుక్రవారం 93 రోజులకు చేరుకుంది. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ 320 జీ అధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా గుంటుక మహేష్ - వందన దంపతులు, ప్రముఖ వ్యాపారవేత్త ఎంఈ రహూఫ్ ల పుట్టిన రోజు పురస్కరించుకొని రోగులకు ఆల్పాహారం అందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పట్టణ అధ్యక్షుడు చంద్ర మోహన్, సభ్యులు కొత్త విద్యాసాగర్, ఉషాకిరణ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

సారంగాపూర్, మే, 17: కాలిన గాయాలతో ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి చెందిన సంఘటన మండలంలోని ఒడ్డెర కాలనీలో చోటు చేసుకుంది. ఎస్సై దత్తాద్రి తెలిపిన వివరాల మేరకు ఒడ్డెర కాలనీకి చెందిన గద్దల బక్కవ్వ (60) భర్త నర్సయ్య ఏడాది క్రితం మృతి చెందాడు. దీంతో బక్కవ్వ ఒం టరిగా నివాసం ఉంటుంది. ఈ నెల 15న బక్కవ్వ ఇంట్లో వంట చేస్తున్న క్రమంలో గ్యాస్ సిలీండర్ రెగ్యులేటర్ నుంచి మంటలు వచ్చి చీరకు అంటు కోవడంతో చుట్టు ప్రక్కల వారు గమనించి చికిత్స నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం చికిత్స పొందుతూ మృతి చెందింది. బంధువు బక్కయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తడిసిన ధాన్యం

బీర్‌పూర్,మే 17: మండలంలో గురువారం రాత్రి కురిసిన వర్షం కారణంగా కొనుగోలు కేంద్రాలలోని వరి ధాన్యం తడిసింది. మండలంలోని తుంగూర్, కందెనకుంట, చెర్లపెల్లి, బీర్‌పూర్, మోతినగర్‌లలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో తూకం వేసిన వరి ధాన్యం బస్తాలతో పాటు వడ్ల రాసులు కూడా తడిసి ముద్దయ్యాయి. అంతే కాకుండా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నెలలు గడుస్తున్న కేంద్రాలలో తూకం చేయడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి వేళల్లో కొనుగోలు కేంద్రాల వద్ద కాపలదారులు లేకపోవడంతో అడవి పందులు వచ్చి వరి ధాన్యపు కుప్పలను ద్వంసం చేస్తున్నాయని రైతులు పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరి ఎక్కువగా నష్టం జరుగక ముందుగానే కేంద్రాలలో నిల్వ ఉన్నా ధాన్యాన్ని తూకం వేసి వెంటనే కొనుగోలు కేంద్రాలకు తరలించే ఏర్పాట్లు చేయాలని రైతులు కోరుతున్నారు.

వర్షపు నీరు తొలగింపు

మెట్‌పల్లి, మే, 17 : మెట్‌పల్లి మున్సిపల్ పరిదిలో నిలిచిన వర్షాపు నీరును కమిషనర్ మోహన్ ఆదేశాల మేరకు సిబ్బంది తొలగించారు. గురువారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షం కారణంగా పట్టణంలోని లోతట్టు ప్రాంతంలో నిలిచిన నీరు, డ్రైనేజీలలోని నిలిచిన చెత్తను జేసీబీ సహాయంతో తొలగించారు. రోడ్లపై నిలిచి నీటిని, మురికి కాలువలను శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది ముజీబ్, నిజాం, నరసయ్య, పారిశుధ్యం కార్మికులు, పాల్గొన్నారు.

దర్గాలో మొక్కు చెల్లింపు

సిరిసిల్ల రూరల్, మే 17: సిరిసిల్ల జిల్లా టాటా మ్యాజిక్ యూనియన్ సభ్యులు శుక్రవారం గొల్లపల్లి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కులు చెల్లించారు. సిరిసిల్ల పట్టణంలోని కొత్త బస్టాండ్ నుంచి పాత బస్టాండ్ వరకు మ్యాజిక్ ఆటోలతో ర్యాలీ తీసి ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి దర్గాకు చేరుకున్నారు. ఈ సందర్భంగా మొక్కులు చెల్లించుకున్నారు. టాటా మ్యాజిక్ యూనియన్ అధ్యక్షుడు వెంకటేశం, ఉపాధ్యక్షుడు రాజేందర్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి విశ్వనాథుల వినోద్ పాల్గొన్నారు.

విదేశీ పర్యటనలో ప్రభుత్వ విప్ ఆది

వేములవాడ టౌన్, మే 17 : విదేశీ పర్య టనలో భాగంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శుక్రవారం దుబాయి వెళ్లారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత దుబాయిలో ఉన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను కలిసేందుకు వెళ్లినట్లు తెలిపారు. దుబాయిలో ఐదు రోజులపాటు పర్యటించనున్నారు. దుబాయికి చేరుకున్న ప్రభుత్వ విప్ ఆదికి ఎన్ఆర్ఐలు స్వాగతం పలికారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వెల్గటూర్‌లో దోమల నివారణపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది


వెల్గటూర్, మే 17: ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి శ్రావణ్ కుమార్ సూచించారు. ఫ్రై డే డ్రై డే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలో నివసిస్తున్న కాలనీలో దోమల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో సంభవించే అంటు వ్యాధులు, దోమల వలన వచ్చే వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. దోమలు పుట్టకుండా ఉండాలంటే ప్రతీ ఒక్కరు చుట్టుపక్కల ప్రాంతాలలో నీరు నిలువ ఉండకుండా చూడాలని కోరారు. పాత ప్లాస్టిక్ డబ్బాలు, కొబ్బరి చిప్పలు, పాత టైర్లు వంటివి ఇంటి సమీపంలో లేకుండా చూసుకో వాలన్నారు. ప్రతీ ఒక్కరు దోమలు పుట్టకుండా, కుట్టకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ చంద్రలీల, ఏఎన్ఎం జయప్రద, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పెగడపల్లి : రాబోవు వార్షకాలంలో వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు గాను ప్రతి ఇంట వారానికి ఒక రోజు డ్రైడే పాటించాలని పంచాయతీ, వైద్య సిబ్బంది కోరారు. మండలంలోని పెగడపల్లిలో శుక్రవారం వైద్య సిబ్బందితో కలసి పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ ఇల్లిల్లూ తిరుగుతూ ఇంటి ఆవరణలో రోజుల తరబడి నిల్వ ఉండే పాత్రలలో నీటిని పారబోయించారు. వ్యాధుల బారిన పడకుండా వారానికి ఒక రోజు డ్రైడే పాటించాలని సూచించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కోనరావుపేట, మే 17 : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి సుమన్ మోహన్‌రావు అన్నారు. కోనరావుపేట మండలంలోని సుద్దాల, కొలనూరు, మామిడి పల్లి, నిజామాబాద్, మట్టిమల్ల గ్రామాల్లో డెంటల్, చెవి, ముక్కు, గొంతు సంబంధించిన వ్యాధులపై శుక్రవారం మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుద్దాల, మామిడిపల్లి వైద్య శిబిరంలో మాట్లాడారు. ఈ వైద్య శిబిరాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వచ్చే వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందన్నారు. ప్రజలను అప్రమత్తం చేసి వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. శిబిరంలో మండల వైద్యాధికారి మదన్‌మోహన్, వైద్యులు శ్రీనివాస్, సుష్మ, శివరామకృష్ణ, ప్రీతి, అఖిల్ పాల్గొన్నారు.

అసౌకర్యాలకు నిలయం..రాయికల్ బస్టాండ్



రాయికల్ బస్టాండ్

- ప్రయాణికులకు తప్పని కష్టాలు
- మరుగుదొడ్లు లేక ఇబ్బందులు

రాయికల్, మే 17: రాష్ట్ర ప్రభుత్వం ప్రయాణికుల సౌకర్యార్థం బస్సు సర్వీసులను ఉచితం చేసినప్పటికీ, ప్రయాణికుల సమస్యలు మాత్రం పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. మండుటెండకు ఉందామంటే నిలువ నీడ లేక, అత్యవసరమైతే మలమూత్రాలకు వెళ్లాంటే సరైన మరుగుదొడ్లు లేక ప్రయాణికులు పాట్లు పడుతున్నా పట్టించు కునే నాథుడే కరువయ్యాడు. దీనికి తార్కాణమే ఆయికల్ బస్టాండ్. రాయికల్ మున్సిపల్ పట్టణంతో పాటు మండలంలో 32 గ్రామాలు ఉండగా, దాదాపు 65 వేలకు పైగా జనాభా ఉంటుంది. వీరందరికీ బస్సు ప్రయాణం చేయాలంటే రాయికల్ బస్టాండ్ దిక్కు.. వీరితో పాటు రాయికల్ పట్టణానికి మల్లాపూర్, ఖానాపూర్, కోరుట్ల, మేడిపల్లి మండలా లకు సరిహద్దు మండలంగా అలాగే వ్యాపార వాణిజ్య సంస్థలకు నెలవుగా ఉండి నిత్యం బస్టాండ్ ప్రయాణీకులతో రద్దీగా ఉంటుంది. కాగా వేసవి కాలం సమీపించి రోజులు గడుస్తున్నా కనీస నీడను ఏర్పాటు చేయడంలో పాల కులు, అధికారులు విఫలమవడంతో, భగభగ మండే ఎండ తీవ్రతకు ప్రయాణికుల పాట్లు అన్నీఇన్నీ కావు. ప్రయాణికులు నిలుచునేందుకు నిలువ నీడ లేకపోవడంతో సమీపంలోని బస్టాండ్ దుకాణాల ఎదుట గల నీడలో నిలుచుకుంటున్నారు. దీంతో షాపు యాజమానులు అవమానానికి గురి చేస్తున్నారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గంటల తరబడి ఎండలో నిలబడి చాలా మంది ప్రయాణికులు స్పృహ తప్పి పడిపోయిన సంఘటనలు సైతం ఉన్నాయి. గతంలో మున్సిపల్, ఆర్టీసీ అధికారుల సమన్వయంతో స్వచ్ఛంద సంస్థల సహకారంతో బస్టాండ్‌లో ప్రయాణీకులకు నీడను కల్పించేందుకు తాత్కాలికంగా గ్రీన్ మ్యాట్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అధికార పాలకవర్గాలు పట్టించుకోకపో వడం, స్వచ్ఛంద యువజన సంఘాల సభ్యులకు అవగాహన కల్పించక పోవడంతో రాయికల్ బస్టాండ్‌లో ప్రయాణికులకు అగచాట్లు తప్పడం లేదు.

కంపు కొడుతున్న మరుగుదొడ్లు, ప్రయాణికుల అగచాట్లు..

రాయికల్ బస్టాండ్‌లో ప్రయాణికులకు, ప్రజలకు అనువైన మరుగుదొడ్లు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పిల్లలు, మహిళల ఆవేదన అంతా ఇంతా కాదు. అత్యవసరమై మల మూత్రానికి వెళ్లాలంటే పాత మున్సిపల్ కార్యాలయం పక్కన గల మరుగుదొడ్లే గతి. కానీ ఈ మరుగుదొడ్లు శుభ్రం చేయపోవడంతో కంపు కొడుతున్నాయి. అత్యవసరమై మరుగుదొడ్లకు వెళ్లాలంటే పిల్లలు, మహిళలు ఎటు వెళ్లాలో తెలియక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం రద్దీతో ఉండే బస్టాండ్‌లో మరుగుదొడ్ల ఏర్పాటుతో పాటు పర్యవేక్షణ చేయాల్సిన అధికార పాలకులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడంతో మరుగుదొడ్లు చెత్తా చెదారం, మలమూత్రాలతో నిండిపోయి దుర్గంధం వెదజల్లుతూ నిరు పయోగంగా తయారయ్యాయి. మరుగుదొడ్లను నిత్యం శుభ్రం చేయా ల్సిన సిబ్బంది తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం, అధికారుల పర్యవేక్షణ లోపించడంతో పట్టణ ప్రజలకు, ప్రయాణీకులకు మరుగుదొడ్ల బాధ తప్పడం లేదు.



బస్టాండ్‌లో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

ఇప్పటికైనా సంబంధిత మున్సిపల్ అధికారులు, ఆర్టీసీ అధికారులు స్పందించి రాయికల్ బస్టాండ్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం తక్షణమే తాత్కాలిక ఉపశమనం కోసం గ్రీన్ మ్యాట్ ఏర్పాటు చేయా లన, అలాగే నిరుపయోగంగా మారిన మరుగుదొడ్లను ప్రయాణి కులకు పట్టణ ప్రజలకు ఉపయోగపడేలా, వెంటనే శుభ్రం చేయించి ప్రజలు మరుగు దొడ్ల బాధలు తీర్చాలని మండల ప్రజలు కోరుతున్నారు.